క్లుప్తంగా

ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాలకు 31 వరకు గడువు

పాడేరు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు ఈనెల 31 వరకు గడువు ఉందని పాడేరు అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ మురళీధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని సూచించారు. వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందుపర్చి అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రంలో వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ ఫీజు కూడా ఆన్‌లైన్‌లో చెల్లించాలని కోరారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ రెండు, మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించేందుకు ఈనెల 15వరకు గడువు ఉందన్నారు. పూర్తి వివరాలకు 9490458695, 7382929728 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆలయాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం



ఆలయం ఆవరణలో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు, చైర్మన్ నాయుడు

అనకాపల్లి : స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సత్యనారాయణ,సూర్యనారాయణస్వామి దేవాలయంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు అన్నారు. బుధవారం రాత్రి రాష్ట్ర అమరావతి దేవదాయశాఖ స్థపది శ్రీనివాసరావు సందర్శించారు. చైర్మన్ మాట్లాడుతూ దేవాలయం ఆవరణలో ఖాళీస్థలంలో వివాహాలు జరుగుతున్నాయని, వివాహ సమయంలో పెండికుమారుడు, కుమార్తెలకు కొత్తగా రెండు రూమ్‌ల నిర్మాణానికి, రెండు షాప్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఆదినారాయణ, ధర్మకర్తలు మారిశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట అప్పలనాయుడు, ఎక్స్ ఆఫీషియో మెంబర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

అప్పన్న ప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. సింహాచలంకి చెందిన శ్రీహర్ష రూ. లక్ష చెక్‌ను ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు, మాధవదార ప్రాంతానికి చెందిన శ్రీరామ్,జయలక్ష్మి దంపతులు రూ. లక్ష విరాళం అన్నప్రసాద విభాగం ఏఈవో నరసింగరావు అందజేశారు. దాతలకు దేవస్థానం తరపున బాండ్లు అందజేశారు.

ఊరంతా ఉల్లాసం... ఇంటింటా ఆనందం



దుస్తుల కొనుగోళ్లలో పల్లె జనం

- సొంతూళ్లకు తరలివస్తున్న వలస జనం
- సందడితో పులకించి పోతున్న పల్లెలు



ఆనందంగా తమ స్వగ్రామాలకు వస్తున్న వలస కూలీలు

చోడవరం: సంక్రాంతి పండగ రావడంతో పల్లెలన్నీ జనంతో కలకలలాడుతున్నాయి. ఇప్పటికే పాఠశాలలు, కాలేజీలు, ఇతర విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో దూర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులంతా తమ స్వగ్రామాలకు వచ్చేశారు. వివిధ పనుల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లిన కూలీలు కూడా వారి సొంతూళ్లకు చేరుకుంటున్నారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల మండలాల నుంచి ఏటా వందలాది మంది కూలీలు తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా,ఒంగోలు, నెల్లూరు జిల్లాలకు వరి కోతలు, ఇతర కూలి పనులకు వెళ్లి నెలల తరబడి అక్కడే ఉంటారు. మరికొందరు చెన్నై, కోల్‌కత్తా, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు రోజువారీ కూలిపనులకు వెళతారు. వీరంతా పిల్లలను, వృద్ధులను స్వగ్రామాల్లో వదిలేసి ఏడాదంతా అక్కడ పనులు చేసి నగదు సమకూర్చుకుని సంక్రాంతి నాటికి తమ సొంత ఊళ్లకు చేరుకుంటారు. ఎక్కడెక్కడికో జీవనోపాధికోసం వెళ్లిన వారంతా ఇప్పుడు గ్రామాలకు చేరడంతో పల్లెలన్నీ జనంతో ఎంతో సందడిగా ఉన్నాయి.

నెలల తరబడి ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన తమ బిడ్డలు ఇప్పుడు ఇళ్లకు రావడంతో ఆ కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయి. ఏ ఇంటిలో చూసినా ఆనందం తాండవిస్తోంది. ఈ ప్రాంతం వలస కూలీలంతా రైళ్లలో అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో దిగడంతో స్టేషన్ కూడా జనంతో కిటకిటలాడింది. ఇక పరిసర ప్రాంతాలకు వెళ్లే వారితో చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్,



ఆటోలపై సామాన్లతో వస్తున్న కూలీలు

ఆటో స్టాండ్‌లన్నీ రద్దీగా ఉన్నాయి. పట్టణాలకు, షాపింగ్ మాల్స్‌కు దూరంగా ఉన్న చిన్నచిన్న పల్లెటూర్లలో దుస్తులు అమ్మేవారి సందడి మొదలైంది.

మురి'బాల' సంక్రాంతి



మహిళలకు ముగ్గుల పోటీల నిర్వహణ



నాతవరంలో సంప్రదాయ వంటలు చేస్తున్న ఉపాధ్యాయులు



కె.కోటపాడులోని పాఠశాలలో భోగి వేడుక

- పాఠశాలల్లో ముందస్తు సంబరాలు
- ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు

కె.కోటపాడు/నాతవరం : రంగురంగుల ముగ్గులు, హరిదాసుల పాటలు, డూడూ బసవన్నల విన్యాసాలు, నూరూరించే సంప్రదాయ వంటకాలు..మన సంస్కృతీసంప్రదాయాలు చాటి వస్త్రధారణలతో పలు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలతో బాలలు సందడి చేశారు. కె.కోటపాడులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో వేడుకల్లో పాల్గొన్నారు. భోగి మంట వేసి, మహిళలకు ముగ్గుల పోటీల నిర్వహించారు. చిన్నారుల ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. నాతవరం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు, డి.యర్రవరం రుం.బి.పట్నం స్కూళ్లలో విద్యార్థులు ఆటలు పాటలతో సందడి చేశారు. పాఠశాలల ప్రాంగణంలో పలు సంప్రదాయ పిండివంటలు తయారు చేశారు.ఈ సందర్భంగా ఎంఈవో ఎంఈవో తాడి అమృత్‌కుమార్ మాట్లాడుతూ ఆచార, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేసే బాధ్యత అందరిపై ఉందన్నారు.

గిరిజనేతర రైతుల ఆందోళన తీవ్రతరం

- పెదగంగవరంలో పెట్రోల్ క్యాన్లతో, దేవరాపల్లిలో నీళ్ల ట్యాంక్ ఎక్కి నిరసన
- సంక్రాంతి తర్వాత పరిశీలిస్తామన్న డిప్యూటీ కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ



పెదగంగవరంలో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగిన రైతులు, మహిళలు

దేవరాపల్లి/అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదగంగవరం గ్రామానికి చెందిన గిరిజనేతర రైతులు తమ భూ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమీపంలోని అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో మంచినీటి ట్యాంక్ ఎక్కి బుధవారం నిరసన చేపట్టారు. తరతరాలుగా వ్యవసాయ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న తమకు అన్ని హక్కులు ఉన్నా 1/70 చట్టం పేరుతో గిరిజన సంఘాల నాయకులు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని నిరసిస్తూ పెదగంగవరంలో గత ఐదు రోజులుగా వారు నిరసన దీక్షలు చేస్తున్నారు. అధికార యంత్రాంగం స్పందించలేదంటూ బుధవారం నిరసనలను ఉధృతం చేశారు. కొందరు రైతులు పెట్రోల్ కేన్లతో పెదగంగవరం రామాలయంలో తలుపులు వేసుకొని, మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. సుమారు పది మందికి పైగా రైతులు దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో 50 అడుగుల మేర ఎత్తున్న మంచినీటి ట్యాంక్ ఎక్కి తమ భూ సమస్య పరిష్కరించకుంటే దూకి ఆత్మహత్య చేసుకుంటామంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న చోడవరం సీఐ కుమారస్వామి, దేవరాపల్లి తహసీల్దార్ ఎం.లక్ష్మి దేవరాపల్లి మంచినీటి ట్యాంక్ వద్దకు చేరుకున్నారు. చోడవరం నుంచి ఫైరింజన్‌ను రప్పించి నిరసనకారులను కిందకు దించేందుకు చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో వారంతా పెదగంగవరం చేరుకున్నారు. రామాలయంలో ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడగా అల్లూరి జిల్లా అధికార్ల నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు నిరసన విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. దీంతో అల్లూరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ శర్మతో ముందుగా తహసీల్దార్ మాట్లాడి ఇక్కడి ఆందోళన పరిస్థితిని వివరించారు. అనంతరం అన్నదాతలతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో మాట్లాడించారు. సంక్రాంతి పండగ తర్వాత గ్రామానికి వచ్చి అన్నదాతల ఆవేదన స్వయంగా తెలుసుకొని పరిష్కారానికి చొరవ చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. దీంతో సంతృప్తి చెందిన రైతులు ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. దేవరాపల్లిలో ట్యాంక్‌పై నిరసన చేస్తున్న రైతులకు ఈ విషయం చెప్పడంతో వారంతా కిందికి దిగారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి పూర్తిస్థాయిలో కృషి

- కొయ్యూరు వైఎస్సార్‌సీపీ నేతల వెల్లడి



మత్స్యరాస విశ్వేశ్వరరాజుతో కొయ్యూరు వైఎస్సార్‌సీపీ నేతలు

పాడేరు : పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి తామంతా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని కొయ్యూరు మండల జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, డొనూరు ఎంపీటీసీ సభ్యుడు బిడిజాన అప్పారావు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కొయ్యూరు మండలానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాడేరులో అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజుతో సమావేశమయ్యారు. నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంతో వారు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే వైఎస్సార్‌సీపీ తమ మండలంలో పటిష్ఠంగా ఉందన్నారు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాలకు తీసుకువెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కొయ్యూరు మండలంలో పర్యటించి స్థానిక నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని వారు సూచించారు. కొయ్యూరు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాట్టిక పోతురాజు, పెట్ల గాంధి, సమరెడ్డి కృపానందం, హరీష్, వసకృష్ణ పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో కత్తిపూడి నగర సంకీర్తన బృందం



ఉపమాక వెంకన్నను దర్శించుకున్న కత్తిపూడి నగర సంకీర్తన బృందం

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామివారిని కాకినాడ జిల్లా కత్తిపూడికి చెందిన నగర సంకీర్తన బృందం సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈ బృంద సభ్యులు కత్తిపూడి, పరిసర గ్రామాల్లో ప్రతి రోజు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తుంటారు. ధనుర్మాస విశిష్టతను ప్రచారం చేస్తున్నారు. కత్తిపూడి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో గల వేణుమాధవస్వామి హరే కృష్ణ నగర సంకీర్తన బృందం బుధవారం ఉపమాక వెంకన్న ఆలయాన్ని దర్శించుకుంది. ఉపమాక మాడ వీధుల్లో హరేరామ హరే రామ రామ రామ హరే హరే హరే కృష్ణ హరే కృష్ణ , కృష్ణ కృష్ణ హరే హరే అనే సంకీర్తనతో ఊరేగింపు నిర్వహించారు. ఎనిమిదేళ్లుగా ఏటా తమ బృందం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ కాలింగ నూకరాజు తెలిపారు. ఉపమాక ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆలయ విశిష్టతలను, స్వామివారికి నిర్వహించే సేవలు, ఉత్సవాలను, భోగినాడు జరిగే గోదాదేవి కల్యాణ మహోత్సవం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఈ బృందానికి నాయకత్వం వహిస్తున్న జీలకర్ర త్రిమూర్తులు, కంద గోవిందు, కేలంగి పేర్రాజు, జీలకర్ర లక్ష్మణరావు, కందా తాతీలు, కోలా నాగు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



బేడా ప్రదక్షిణలో ఎంపీలు రెజ్వీర్ సింగ్, కిషన్ కపూర్ తదితరులు



అప్పన్న సన్నిధిలో మాజీ ఐఏస్, ఐపీఎస్ అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఎంపీలు రెజ్వీర్ సింగ్, కిషన్ కపూర్, ఐఏఎస్ అధికారి ఆర్.కె.సూర్యనారాయణ, ఎంటీపీ అండ్‌ఎస్‌జీ డైరెక్టర్‌లు దీపిక, కుల్మోహన్ సింగ్ అరోరా దర్శించుకున్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో వీరి పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపికలను, శేషవస్త్రాలను దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న మాజీ ఐఏఎస్, ఐపీస్ అధికారులు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం మాజీ ఐఏఎస్ అధికారులు శైలజా చంద్ర, రమేష్‌చంద్ర, ఐపీఎస్ అధికారి ఆర్.కక్కర్ స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. వారికి స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.


ఏయూలో వెస్టర్న్ ఆస్ట్రేలియన్ కార్నర్



వెస్టర్న్ ఆస్ట్రేలియన్ కార్నర్‌ను ప్రారంభిస్తున్న వీసీ సమత, జెన్నిఫర్ హోవెల్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వెస్టర్న్ ఆస్ట్రేలియన్ కార్నర్ బుధవారం ప్రారంభమైంది. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా ప్రో చాన్సలర్ జెన్నిఫర్ హోవెల్ దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య కె.సమత మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది, ప్రయోగశాలలు, గ్రంథాలయం వంటి వసతులను కలిగి ఉందన్నారు. ఏయూలో 58 దేశాలకు చెందిన 1,084 మంది విదేశీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. వీరికి అవసరమైన హాస్టళ్లు, వసతులను కల్పించామన్నారు. సుందర నగరం విశాఖ పర్యాటకులకు స్వర్గధామంగా ఉందన్నారు. జెన్నిఫర్ హోవెల్ మాట్లాడుతూ విభిన్న రంగాల్లో ఏయూతో కలిసి పనిచేస్తామన్నారు. రెండు వర్సిటీలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఓఎస్డీ ఆచార్య వి.కృష్ణమోహన్.. ఏయూలో నిర్వహిస్తున్న కోర్సులు, వసతులు, విదేశీ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు తదితర అంశాలను వివరించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఏయూలో సమర్థంగా నిర్వహిస్తున్న అమెరికన్ కార్నర్ పనితీరు, నిర్వహించిన కార్యక్రమాలపై మాట్లాడారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి వర్చువల్ విధానంలో పాల్గొని రెండు వర్సిటీల ప్రతినిధులను అభినందించారు. గవర్నమెంట్ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడ్ కమీషనర్(ఇండియా-గల్ఫ్) నషీద్ చౌదరి, ఎడ్యుకేషన్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఆంటోని జోసెఫ్, ఏయూ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.కె భట్టి, వి.విజయలక్ష్మి వై.రాజేంద్రప్రసాద్, ఏ.నరసింహారావు, జి.శశిభూషణరావు, ఆచార్య టి.శోభశ్రీ, గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవిత విశేషాలపై లఘు చిత్రాల ప్రదర్శన



చిత్ర ప్రదర్శన తిలకిస్తున్న ప్రేక్షకులు

సీతంపేట: జన్ భాగీదారి పేరిట జిల్లాలో నిర్వహిస్తున్న చైతన్య కార్యక్రమాలు రెండవ రోజూ ఉత్సాహంగా సాగాయి. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవిత విశేషాలను వివరిస్తూ.. అంబేడ్కర్ భవన్‌లో బుధవారం లఘుచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శించిన లఘు చిత్రాలు, ఛాయా చిత్రాలను ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. రెండవ రోజు పలువురు దాతలు ముందుకు రక్తదానం చేశారు. ఇక్కడ ప్రదర్శించిన లఘుచిత్రాల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఉత్తమ చిత్రానికి ముఖ్యమంత్రి చేతులమీదుగా నగదు బహుమతి అందజేయనున్నారు. డీపీవో శ్రీనివాసరావు, డీఎల్డీవో పూర్ణిమాదేవి, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

నర్సీపట్నం : మండలంలోని గదవపాలెం గ్రామ శివారుల్లో నిర్వహిస్తున్న సారా తయారీ బట్టీలపై రూరల్ ఎస్ఐ ధనుంజనాయుడు సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3 వేల లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే వంట పాత్రలను స్వాధీనం పరుచుకున్నారు. సారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

చలికాలంలో ఆహార నియమాలు పాటించాలి

- చేపలతో పుష్కలంగా డి-విటమిన్
- కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య శాఖ శాస్త్రవేత్త డాక్టర్ వీరాంజనేయులు



శాస్త్రవేత్త డాక్టర్ వీరాంజనేయులు



రంపచోడవరం: చలికాలంలో ఆరోగ్యంపై ప్రత్యేక తీసుకోవాలని, ఆహర నియమాలు తప్పనిసరిగా పాటించాలని కృషి విజ్ఞాన మత్స్యశాఖ శాస్త్రవేత్త డాక్టర్ కె.వీరాంజనేయులు అన్నారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ శీతాకాలంలో వివిధ రుచికరమైన ఆహార పదార్థాలను ప్రయత్నించవచ్చన్నారు. చేపలు తినడం ద్వారా శరీరానికి పుష్కలంగా విటమిన్లు లభిస్తాయన్నారు. మోనోఅన్ శాచురేటిడ్ కొవ్వు, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు సంవృద్ధిగా ఉన్న సాల్మన్ వంటి చేపలను తినడం వల్ల గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. వివిధ రకాల విటమిన్లు, ఖనిజాలను కలిగి ఉన్నందున రోగ నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. దీంతో పాటు రాగులు, కొర్రలు తదితర చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా తీసుకోవాలని సూచించారు. చలికాలంలో సూర్యరశ్మి ప్రభావం అంతగా ఉండకపోవడంతో శరీరానికి డి-విటమిన్ తక్కువగా లభిస్తుందన్నారు. ఈ కారణంగా శరీరంలో రోగ నిరోధక శక్తి దెబ్బతింటుందని చెప్పారు. చేపలు, చిరుధాన్యాలు, బీన్స్, గుడ్లు తదితర పోషకాహారాలు తీసుకోవడడంతో డి-విటమిన్ సమృద్ధిగా లభిస్తోందన్నారు. చేపలు తినడం వల్ల జలుబు, ఫ్లూ ఇతర శ్వాసకోశ వ్యాధులు సోకకుండా శరీరంలో రోగ నిరోధక శక్తి కాపాడుతుందని చెప్పారు. జర్నల్ ఆఫ్ అలర్జీ అండ్ క్లినికల్ ఇమ్యునాలజీలో ఇటీవల ప్రచురించిన ఒక అధ్యయనంలో రక్తంలో ఒమేగా -3 , ఒమేగా-6 వంటి బహుళ కొవ్వు ఆమ్లాల స్థాయి వల్ల పిల్లల్లో ఆస్తమా, రినైటిస్ వంటి అలర్జీ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించేందుకు దోహదపడతాయని పరిశోధనల్లో తేలినట్టు పేర్కొన్నారు. చలికాలంలో కీళ్ల , కండరాల నొప్పులకు కూడా ఇది కారణమన్నారు. ఈ కారణంగా ఒమేగా- 3 ఫ్యాటీ యాసిడ్ అధికంగా ఉండే చేపలు, బీన్స్, వాల్‌నట్స్ వంటిని రోజూ వారీ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు.

క్లుప్తంగా

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సీత, ఎంపీపీ అమల తదితరులు

మోతుగూడెం: మోతుగూడెం పంచాయతీలోని పాత మసీదు నుంచి వినాయక గుడి వరకు ఎంపీపీ నిధులుతో నిర్మించే సీసీ రోడ్డుకు పనులను బుధవారం సర్పంచ్ ఆకేటి సీత ప్రారంభించారు. ఎంపీపీ అమల మాట్లాడుతూ రూ. 2లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళీ, పార్టీ మండల కన్వీనర్ వై.రామలింగారెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో విజయ రంగారావు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం సామాజిక సమతా సంకల్ప సాధికార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయ రంగారావు మాట్లాడుతూ విజయవాడలో ఈనెల 19న బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇందులో భాగంగా సామాజిక సమతా సంకల్ప సాధికార కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ నేతల ర్యాలీ

రంపచోడవరం: రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖలో (గిరిజన విద్య) అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు కనీస వేతనం లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు. డీడీ అస్సలోముకు వినతిపత్రాన్ని అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న డీడీ అస్సలోము

రంపచోడవరం: ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం(ఏపీటీడబ్ల్యూటీయూ) డైరీ, క్యాలెండర్‌ను గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ అస్సలోము బుధవారం ఆవిష్కరించారు. నేతలు గాంధీబాబు, రంగారావు, మంగిరెడ్డి, సత్యనారాయణ, బాలురెడ్డి పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



కొండరెడ్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న విద్యుత్‌శాఖ ఉద్యోగులు

చింతూరు: మండలంలోని చింతలపాడుకు చెందిన కొండరెడ్డి కుటుంబాలకు స్థానిక విద్యుత్ శాఖ ఉద్యోగులు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. పురుషులకు దుప్పట్లు, లుంగీలు, మహిళలకు శాలువాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌దొర, జేఎల్ఎంలు లింగయ్య, చలపతి, ముదరాజు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి గురువారం పూజలకు ఏర్పాట్లు

కశింకోట: కశింకోటలో ప్రసిద్ధి చెందిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఆఖరి గురువారం పూజలకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్ తెలిపారు. మార్గశిర మాసోత్సవాల ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగినట్లుగా సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.

ఇది కదా అభివృద్ధి

చకచకా పనులు

- సర్కారు బడుల్లో కార్పొరేట్ లుక్, అధునాతన వసతులు
- బాలికల-2 పాఠశాలలో లక్షలాది రూపాయలతో నాడు-నేడు పనులు
- అదనపు తరగతి గదులు, డైనింగ్, కిచెన్ హాల్ నిర్మాణాలు
- విద్యార్థుల తల్లిదండ్రుల హర్షాతిరేకం

చదువుల బడి బాగు పడింది. నాణ్యమైన విద్య అందుతోంది. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా మారింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు-నేడుతో సర్కారు బడుల రూపురేఖలు మారాయి. ఉన్నత విద్యా ప్రమాణాలతో బోధన, అధునాతన సదుపాయాలు దర్శనమిస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి కనుబరుస్తున్నారు. కోట్లాది రూపాయలతో పనులు జరుగుతున్నాయి. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూర దృష్టితో సాధ్యపడిందని గిరిజనులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అనంతగిరి: టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్కారు బడులు అధ్వానంగా ఉండేవి.. కనీస సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పైకప్పు కూలిన.. గచ్చులు లేని గదులతో దర్శనమిచ్చేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని విద్యావ్యవస్థలో సమూలమార్పునకు శ్రీకారం చుట్టారు. అభివృద్ధితో స్వాగతం పలుకుతున్నాయి.. మండల కేంద్రంలోగల గిరిజన సంక్షేమ బాలికల-2 పాఠశాల మొదటివిడత నాడు-నేడులో సుమారు రూ.65 లక్షలతో అభివృద్ధి చేశారు..అదనపు తరగతి గదులు, డైనింగ్, కిచెన్ షెడ్డు లేకపోవడంతో విద్యార్థినిలు సమస్యలను గుర్తించిన, ప్రభుత్వం విద్యార్థినిలకు సౌకర్యం కలిపించేలా చొరవచూపింది. రూ.1.57 లక్షలు నాబార్డు నిధులతో అదనపు తరగతి గదులు, కిచెన్, డైనింగ్‌హాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో విద్యార్థినిలు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్ లుక్‌తో తరగతి గదులు

గతంలో ప్రభుత్వ పాఠశాల అంటే పాడైన గచ్చులు, పెచ్చులాడిన గోడలు ఉండేవి. అత్యవసరమైతే ఆరుబయటలకు వెళ్లే పరిస్థితి ఉండేది. ఇప్పుడు గ్రానైట్ పలకలతో తరగతి గదులు తళతళలాడుతున్నాయి. డిజిటల్ బోర్డులు వచ్చాయి.అత్యవసరమైతే ఆరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా అధునాతన సదుపాయాలతో మురుగుదొడ్లు నిర్మించారు. మొత్తంగా నాడు- నేడుతో పాఠశాల కార్పొరేట్ లుక్ సంతరించుకుంది.

- ప్రతి పాఠశాలలో 9 అవసరాల నిమిత్తం పనులు చేపట్టారు.ఫ్యాన్లు, బెంచీలు, తాగునీరు, మరగుదొడ్లు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీష్ ల్యాబ్‌లు, అదనపు తరగతి గదులు, ప్రహరీ పనులు చేపడుతున్నారు.
- అనంతగిరి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో రూ.65లక్షలతో పనులు చేశారు
- రెండో విడతలో రూ.60లక్షలతో జూనియర్ కళాశాలలో పనులు చేశారు.
- లుంగపర్తి పాఠశాలలో అదనపు తరగతి గదులు పనులు జరుగుతున్నాయి.

ఏడాది పెరిగిన అడ్మిషన్లు

పాఠశాల అభివృద్ధి బాటలో నడుస్తుండడంతో ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు 290 మంది విద్యార్థిలు ఉండగా 150 మంది నూతన అడ్మిషన్లు జరిగాయి.

మొత్తం 440 మంది వరకు విద్యార్థినిలు విద్యాభ్యాసం చేస్తున్నారు.

మండలం: అనంతగిరి

పంచాయతీలు: 24
గ్రామాలు: 418
జనాభా: 50వేల మంది
ఎంపీపీ పాఠశాలలు: 153
యూపీ పాఠశాలలు: 7
సంక్షేమ పాఠశాలలు: 12
కేజీబీవీ: 1
విద్యార్థుల సంఖ్య: 9,543
మొదటి విడత నాడు-నేడులో ఎంపికైన పాఠశాలలు: 40
మంజూరైన నిధులు: రూ.19.29 కోట్లు
రెండవ విడత నాడు-నేడులో ఎంపికైన పాఠశాలలు: 46
మంజూరైన నిధులు : రూ.10.39 కోట్లు



గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు

పాఠశాలలో మరిన్ని సౌకర్యాలు



పాఠశాలలోని మరిన్ని సౌకర్యాలతో విద్యార్థినిలకు మేలు జరిగింది. అదనపు తరగతి గదులు, డైనింగ్, కిచెన్ పూర్తయితే పాఠశాలలో అన్ని సదుపాయాలు ఉన్నట్టేనన్నారు. అలాగే ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యభోదన సాగిస్తున్నాం. విద్యార్థినిలకు అర్థమయ్యేరీతీలో ఉపాధ్యాయురాలు భోదన ఉందన్నారు.

– మంగమ్మ, హెచ్ఎం, గర్ల్స్–2 పాఠశాల

న్యాణత ప్రమాణాలతో పనులు



నాబార్డులోని నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, కిచెన్, డైనింగ్ హాల్ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపడుతున్నామని, ఎప్పుటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

– గణేష్, ఏఈ ట్రైబల్ వెల్ఫేర్, అనంతగిరి



లుంగపర్తిలో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం



డిజిటల్ బోధన



తరగతి గదిలో విద్యార్థులు



అనంతగిరి ఎంపీపీ పాఠశాల

ఇంటింటికీ అక్షింతల పంపిణీ



ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు



పనస గ్రామంలో అక్షింతలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మిల్కి

కొయ్యూరు: మర్రివాడ పంచాయతీ లూసం గ్రామంలో అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలను ఊరేగింపుగా ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. వీహెచ్‌పీ .మండల ధర్మ ప్రచారక్ మల్లిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 22న అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో భక్తులందరూ ఆరోజు సాయంత్రం దీపాలను వెలిగించాలని కోరారు. వీర్రాజు, ఇతర ధార్మిక సంస్థలకు చెందిన వారు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన గిరిజనులు అంతా పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామంలో సర్పంచ్ కిరసాని మిల్కి ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యల్లో పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



ఎటపాకలో బాధితుడికి సామగ్రి అందజేస్తున్న వైద్యుడు జమాల్‌ఖాన్



పచ్చనాపల్లిలో బాధిత కుటుంబానికి నగదు, దుస్తులు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి

ఎటపాక: మండలంలోని గన్నవరం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ వితరణ అందజేశారు. ఈ మేరకు బాధితుడు రావి భూషణం ఇంటి నిర్మాణానికి అవసరమైన రూ.45వేల విలువగల ఐరన్ పోల్స్, సిమెంట్ రేకులు, రూ.16వేల నగదును ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ బుధవారం అందించారు. నిరుపేద కుటుంబానికి ఆసరాగా నిలిచిన వైద్యుడిని పలువురు అభినందించారు. నర్సింహరావు, వెంకట్రావు గ్రామస్తులున్నారు.

జి.మాడుగుల: మండలంలోని గడుతూరు పంచాయతీ పచ్చనాపల్లి గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆదుకుంది. అగ్ని ప్రమాద బాధితుడు కూడా కోటేశ్వరరావు కుటుంబానికి రూ.11వేలు, దుస్తులు, నిత్యావసర సరకులను అందజేశారు. అదే గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న గిరిజనుడికి వెయ్యి రూపాయల నగదు, పండ్లు అందజేశారు. స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మల్లేష్, ప్రతినిధులు తిరుపతిబాబు, లక్ష్మణ్, అప్పారావు, దావీదు, ఉద్యోగ సంఘం నాయకులు సోమయ్య, సింహాచలం, ఉప సర్పంచ్ చిన్నయ్య, మాజీ ఎంపీటీసీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంపు హర్షణీయం



పింఛన్ పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ మిల్కి

ముంచంగిపుట్టు: జగనన్న ఇచ్చిన హామీ ప్రకారమే పింఛన్ పెంపు చేయడం హర్షణీయమని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి అన్నారు. మండలంలోని వనుగుమ్మ పంచాయతీలో పలు గ్రామాల్లో బుధవారం వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ మిల్కి పర్యటించారు. ప్రభుత్వం పెంచిన రూ.3వేల పింఛన్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పింఛన్ పెంపుతో అవ్వా, తాతల జీవితాల్లో వెలుగులు నింపారని, దేశంలో ఎక్కడ జరగని సంక్షేమం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో జరుగుతుందన్నారు. గ్రామ వలంటీర్లు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

కొరియోగ్రాఫర్ శ్రీనుకు నివాళి

కొయ్యూరు: కొరియోగ్రాఫర్ కిముడు శ్రీను(34) మృతికి జిల్లా కొరియోగ్రాఫర్ల గౌరవ అధ్యక్షుడు భరత్ సహా పలువురు సంతాపం తెలిపారు. జిల్లా స్థాయిలో కొరియోగ్రాఫర్, ఈవెంట్ మేనేజర్‌గా శ్రీను పేరు పొందారు. ఆయన అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. మర్రిపాలెంలో ఆయన సంస్మరణ సభ బుధవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న అల్లూరి జిల్లా కొరియోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు సాయికిరణ్, ఉపాధ్యక్షుడు అశ్విన్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు సురేష్ పట్నాయక్, మండల సంఘం సభ్యులు పవన్‌కుమార్ తదితరులు శ్రీను చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శ్రీను కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

గొలుగొండ: రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ఆస్పత్రి సిబ్బంది పనిచేయాలని ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో బుధ వారం నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. సదుపాయాల కల్పనలో వైద్య సిబ్బంది బాధ్యతగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్యామ్‌కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్, గొలుగొండ, పప్పుశెట్టిపాలెం సర్పంచ్‌లు కసిపల్లి అప్పారావు(బుజ్జి), మాకిరెడ్డి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు ప్రతిభను చాటాలి

- హుషారుగా ఆడుదాం ఆంధ్రా పోటీలు
- తరలివచ్చిన క్రీడాకారులు



పాడేరులో బ్యాటింగ్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు



దుంబ్రిగుడలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ



కొయ్యూరులో పోటీల్లో పాల్గొన్న ఎంపీపీ రమేష్



గంగవరంలో క్రీడారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో, ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ , సర్పంచ్‌లు తదితరులు



రాజవొమ్మంగిలో పోటీలను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ చంద్రరాణి

పాడేరు : గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారికి తగిన ప్రొత్సాహం అందించి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు ఎంతో గొప్పవని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం కొద్దిసేపు క్రికెట్ ఆడి యువతను ఉత్సాహపరిచారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులు స్నేహాభావంతో మెలిగి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు. డీఎల్‌డీవో డి.శాంతికుమారి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఎ.జగన్‌మోహన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ్లన్నదొర, మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎ.ప్రభాకర్‌రావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, జిల్లా కార్యవర్గ సభ్యులు దశమూర్తి, సర్పంచ్ సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ చెప్పారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని కోరారు.

దుంబ్రిగడ: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీల్లో భాగంగా మండల కేంద్రంలో బుధవారం మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడాకారుల్లో ఆటల పోటీల్లో ప్రతిభకనబర్చాలన్నారు. క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో ఉషారాణి, వైస్ ఎంపీపీ ఆనందరావు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, సర్పంచ్ రామ్మూర్తి, నాయకులు సింహాచలం, కృష్ణారావు, శ్రీరాములు, శెట్టి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: ఆడుదాం అంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా మండల కేంద్రంలోని పోలీసు గ్రౌండ్‌లో బుధవారం వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను ఎంపీపీ బడుగు రమేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆటల్లో ప్రతిభచాటి గ్రామానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. మండల పార్టీ మండల అధ్యక్షులు జల్లి బాబులు, సచివాలయ కన్వీనర్ సుధాకర్, జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, తహశీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో లాలం సీతయ్య, ఎంఈవో ఎల్.రాంబాబు, చీడిపాలెం సర్పంచ్ సోమన్నదొర పాల్గొన్నారు.

గంగవరం: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసులు క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో ప్రతిభ చాటాలన్నారు. సర్పంచులు కె.అక్కమ్మ పార్వతి, రమణమ్మ, మరిడమ్మ, శివ, ఏపీవోలు కృష్ణంరాజు, ప్రకాష్, పీడీ నాగమణి , పీఈటీలు తదితరులు పాల్గొన్నారు. పాఠశాలలో క్రీడా మైదానం అధ్వానంగా ఉన్నట్టు పలువురు ఎంపీడీవో శ్రీనివాసులు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందించి పిచ్చిమొక్కలు, చెత్త తొలగింపు పనులు చేయించారు.

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, ఎంపీడీవో విజయ రంగరావు ప్రారంభించారు. షటిల్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో చెరకుంపాలెం , కబ్బడీలో రాజవొమ్మంగి-2 విజయం సాధించాయి. వివిధ పాఠశాలల్లో కూడా ఆటల పోటీలు జరిగాయి. వివిధ క్రీడా పోటీల్లో దూసరపాము, రాజవొమ్మంగి-2, వంచంగి, కింద్ర, రాజవొమ్మంగి-2, జడ్డంగి, చికిలింత, లోదొడ్డి టీంలు ఫైనల్స్‌కు చేరుకొన్నాయి. పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు లోవకుమారి, గంగదుర్గ, నాయకులు వీరబాబు, ఆడుదాం ఆంధ్రా ఎంవోటీ రమేష్, పీడీలు పాల్‌బాబు, చిన్నారావు, పీఈటీలు కుమారి, సత్యనారాయణ, మురళీకృష్ణ, రాజ్యలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

కాలువల్లో పూడికతీత

మునగపాక : పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు తెలిపారు. తోటాడ పంచాయతీలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికతీత పనులను ఆయన బుధవారం పరిశీలించారు. వార్డు సభ్యుడు బుద్ద రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

138 మందికి వైద్య సేవలు

కె.కోటపాడు : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల అన్నారు. కింతాడలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమా న్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా 138 మందికి ఆరోగ్య పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఆరుగురి ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. హెల్త్ అసిస్టెంట్ రాజు, రమణ పాల్గొన్నారు.

సారాతో పట్టుబడిన వ్యక్తి అరెస్టు

కోటవురట్ల : నాటుసారాతో పట్టుబడిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం నాటుసారా విక్రయిస్తున్నారన్న సమాచారంతో సుంకపూరు గ్రామంలో పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన అనపర్తి అప్పారావు అనే వ్యక్తి 2 లీటర్ల నాటుసారాతో పట్టుబడ్డాడు. నాటుసారా స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పండగ నేపథ్యంలో మద్యం విక్రయాలు చేసినా పేకాట, కోడిపందాలు ఆడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలు నివారించాలి

మునగపాక:బాల్య వివాహాలను అరికట్టాలని మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఏఐ పాలకొండ రమేష్ కోరారు. ఇందుకు తల్లిదండ్రులు కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. మునగపాకలో బుధవారం బాల్య వివాహాల కారణంగా జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ చిన్న వయస్సులో బాలికలకు వివాహం చేయడం నేరమన్నారు. తెలిసీ తెలియని వయస్సులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.